క్లుప్తంగా

ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలి



పనులు పరిశీలిస్తున్న అధికారులు

ఎచ్చెర్ల: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని హౌసింగ్ ఏఈ వురిటి రాజేంద్రప్రసాద్ ఆదేశించారు. శనివారం అజ్జరాం, ఎస్ఎస్ఆర్‌పురం, ఎచ్చెర్ల గ్రామాల పరిధిలోని జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులకు సకాలంలో బిల్లులు చెల్లిస్తున్నట్లు చెప్పారు. కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ కుమార్‌పట్నాయక్, వెలుగు ఏపీఎం రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

వెంకటస్వామి సేవలు మరువలేనివి



సంతాప సభలో మాట్లాడుతున్న అభిమానులు

జి.సిగడాం: పీవీఎస్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు, ప్రజా సేవకుడు పేడాడ వెంకటస్వామి చేసిన సేవలు మరువరానివని ఫౌండేషన్ చైర్మన్ పేడాడ రామ్మోహనరావు, వైఎస్సార్‌సీపీ నేత పేడాడ శ్రీరామమూర్తి అన్నారు. శనివారం దవళపేటలో వెంకటస్వామి సంతాప సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫౌండేషన్ తరఫున విగ్రహాల ఏర్పాటుతో పాటు పేద విద్యార్థుల ఉన్నత చదువుల కోసం సాయం అందించినట్లు గుర్తు చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి సుజాత, శేఖర్, సత్తిరాజు, కంచరాన రమణారావు, ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నంది తిమ్మన కవితా శైలి గొప్పది



ప్రసంగిస్తున్న శ్రీనివాసరావు

శ్రీకాకుళం కల్చరల్ : శ్రీకృష్ణదేవరాయలవారి ఆస్థాన కవి నందితిమ్మన కవితా శైలి ఎంతో గొప్పదని విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు మంగిపూడి శ్రీనివాసరావు అన్నారు. శనివారం శ్రీకాకుళం ఉపనిషన్మందిరంలో నంది తిమ్మన రచించిన పారిజాతాపహరణంపై ప్రసంగించారు. పలు ఘట్టాలను విశదీకరించారు. అనంతరం వక్తను సత్కరించారు. కార్యక్రమంలో పతంజలి శాస్త్రి, పులఖండం శ్రీనివాసరావు, వెంకటరమణ, నిష్టల నర్సింహమూర్తి, గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రాజశేఖర్



నియామక పత్రాన్ని అందుకుంటున్న రాజశేఖర్ యాదవ్

రణస్థలం: జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఎచ్చెర్ల వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రణస్థలం మండలం జె.ఆర్.పురం పంచాయతీ సీతంవలస గ్రామానికి చెందిన ముద్దాడ రాజశేఖర్ యాదవ్ నియమితులయ్యారు. విశాఖపట్నంలో జాతీయ బీసీ సంక్షేమ ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు లాక వెంగళరావు యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో నియామక పత్రాన్ని అందుకున్నట్లు రాజశేఖర్ శనివారం తెలిపారు.

ఏటీఎం సేవలను వినియోగించుకోవాలి



వెంకటాపురంలో ఏటీఎం కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

లావేరు: ఏటీఎం సేవలను సద్వినియోగం చేసుకోవాలని మురపాక సచివాలయం కన్వీనర్ బాలి శ్రీనివాసనాయుడు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి వెంకటరమణ కోరారు. వెంకటాపురంలో ఏర్పాటు చేసిన హిటాచీ ఏటీఎం కేంద్రాన్ని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని బ్యాంకు ఏటీఎం కార్డుల ద్వారా నగదు పొందవచ్చని చెప్పారు. కార్యక్రమంలో హిటాచీ ఏపీ మాస్టరు ఫ్రాంచైజీ పిసిని రాంబాబు, వైద్యులు ఎ.మోహనరావు, నారాయణశెట్టి వెంకటరమణ, పందిరి శ్రీనివాసరావు, పొందూరు కేశవ, పందిరి లక్ష్మణరావు పాల్గొన్నారు.

వైఎస్సార్ ఆసరా జాబితాలు సిద్ధం

- ఇప్పటికే రెండు విడతల్లో రూ.119.36 కోట్ల లబ్ధి
- 25న లబ్ధిదారుల ఖాతాల్లోకి రూ.59.68 కోట్లు



స్వయం సహాయక సంఘ సభ్యులకు ఆసరా పథకంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల:

మహిళా సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తోంది. మహిళలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు అనేక కార్యక్రమాలు నిర్వహిస్తోంది. అందులో ఒకటి వైఎస్సార్ ఆసరా. 2019 ఏప్రిల్ 11 నాటికి పొదుపు సంఘాలు తీసుకున్న రుణాల మొత్తాన్ని 4 విడతల్లో మహిళల ఖాతాలకు జమచేస్తామని ప్రజా సంకల్ప యాత్రలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారు. పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే రెండు విడతల్లో సొమ్ములు చెల్లించి మహిళలకు అండగా నిలిచారు. ప్రస్తుతం మూడో విడతగా ఈ నెల 25న నగదు బదిలీ చేసేందుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. దీంతో అర్హులైన మహిళల ఖాతాలకు సీఎం జగన్ మోహన్‌రెడ్డి నగదు బదిలీ చేస్తారని డీఆర్‌డీఏ అధికారులు వెల్లడించారు. అర్హులైన లబ్ధిదారుల బయోమెట్రిక్ సేకరించడంతో తుది జాబితాలను సిద్ధం చేశారు.

సచివాలయాల్లో లబ్ధిదారుల జాబితా

మొదటి విడత రుణమాఫీ కింద ఎచ్చెర్ల నియోజకవర్గంలో 6,760 స్వయం సహాయక సంఘాల్లోని 74,373 మంది మహిళల ఖాతాల్లో రూ. 59.68 కోట్లు జమయ్యాయి. రెండో విడతలో కూడా అదే విధంగా జమచేశారు. రెండు విడతలు కలిపి రూ. 119.36 కోట్ల మేర మహిళలు లబ్ధి పొందారు. ప్రస్తుతం మూడో విడతగా ఎచ్చెర్ల మండలంలో 2,024 సంఘాలకు గాను 22,437 మంది సభ్యులకు రూ. 17.48 కోట్లు, లావేరు మండలంలో 1623 సంఘాలకు గాను 17,553 మంది సభ్యులకు రూ.15.18 కోట్లు, రణస్థలం మండలంలో 2024 సంఘాలకు గాను 22,112 మంది సభ్యులకు రూ.18.01 కోట్లు, జి సిగడాం మండలంలో 1,078 సంఘాలకు గాను 12,261 మంది సభ్యులకు రూ.8.92 కోట్లు చెల్లించేందుకు డీఆర్‌డీఏ అధికారులు ఏర్పాట్లు చేశారు. గ్రామ, వార్డు సచివాలయాల్లోలబ్ధిదారుల జాబితాలను సిబ్బంది ఇప్పటికే ప్రదర్శించారు. ప్రస్తుతం ప్రీ లాంచింగ్‌లో భాగంగా సిబ్బంది గ్రామాల్లో లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి ఆసరా పథకం గురించి వివరిస్తున్నారు.

సామాజిక తనిఖీలతో సమస్యలకు చెక్

వైఎస్సార్ ఆసరాను సమర్థంగా అమలు చేసేందుకు ప్రభుత్వ యంత్రాంగం కృషి చేస్తోంది. ఆసరా సొమ్ము జారీలో ఎలాంటి లోటుపాట్లు తలెత్తకుండా సచివాలయాల వద్ద సామాజిక తనిఖీలు చేపట్టారు. అనంతరం లబ్ధిదారుల జాబితాలను రూపొందించారు. ఎవరైనా సభ్యులు చనిపోయినా, నామినీ వివరాలు సక్రమంగా లేకపోయినా వాటిని పరిష్కరించి అర్హులకు సొమ్ము అందేలా జిల్లా అధికార యంత్రాంగం కసరత్తు పూర్తిచేసింది. ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుంటూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సంక్షేమాన్ని కొనసాగిస్తోందంటూ మహిళలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

స్వయం ఉపాధికి మార్గం

వైఎస్సార్ ఆసర పథకం కింద ఇప్పటికే రెండు విడతల్లో ప్రభుత్వం సాయం అందించింది. మూడో విడతకు ఏర్పాట్లు చేస్తున్నాం. బయోమెట్రిక్, సోషల్ ఆడిట్, అభ్యంతరాల పరిశీలన అనంతరం తుది జాబితా సిద్ధం చేశాం. మహిళలు ఆర్థిక సాధికారతకు ప్రభుత్వం ఎన్నో పథకాలను అమలుచేస్తోంది. వాటిని సద్వినియోగం చేసుకుని ప్రతి మహిళా ఆర్థికంగా ఎదగాలి. ప్రభుత్వం ఇస్తున్న నగదు సాయానికి మరికొంత రుణాన్ని తీసుకుని స్వయం ఉపాధి యూనిట్లను ఏర్పాటుచేసుకోవాలి.

– కె రామ్మూర్తి, వెలుగు ఏపీఎం



లబ్ధిదారులకు బొట్టుపెట్టి పథకాన్ని వివరిస్తున్న సిబ్బంది

కల్యాణ వెంకన్నకు ప్రత్యేక పూజలు



పూజలందుకుంటున్న స్వామివారు

శ్రీకాకుళం కల్చరల్: కలెక్టర్ బంగ్లా సమీపంలోని కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు వంశీకృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో సుప్రభాతసేవ, అష్టోత్తర శతనామాలతో పూజలు జరిగాయి. హరినామ సంకీర్తనలు, సామూహిక విష్ణు సహస్ర నామ పారాయణలు నిర్వహించారు. కమిటీ సభ్యులు మర్రి యోగేశ్వరరావు, బెహరా నాగేశ్వరరావు, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలతో జీవితం నాశనం



మాట్లాడుతున్న ఎస్ఈబీ అసిస్టెంట్ కమిషనర్ గోపాలరావు

ఎచ్చెర్ల క్యాంపస్: విద్యార్థులు, విద్యాసంస్థలు మాదక ద్రవ్యాల పట్ల అప్రమత్తంగా ఉండాలని శ్రీకాకుళం ఎస్ఈబీ అసిస్టెంట్ కమిషనర్ కె.గోపాలరావు అన్నారు. ఎచ్చెర్లలోని శ్రీ వేంకటేశ్వరా గ్రూప్ ఆఫ్ కళాశాలలో శనివారం మాదక ద్రవ్యాల రహిత సమాజం అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నత చదువులు చదివి, ఉన్నత స్థానాలకు చేరుకోవాల్సిన యువత డ్రగ్స్ మాఫియా వలలో చిక్కి మాదక ద్రవ్యాలకు బానిసలుగా మారుతున్నారని చెప్పారు. జీవితాలను నాశనం చేసుకుంటూ తల్లిదండ్రులకు కడుపుకోత మిగుల్చుతున్నారని తెలిపారు. గంజాయి, హెరాయిన్, కొకైన్ వంటి నిషేధిత ఉత్పేరకాలు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. మద్యం, ధూమపానం వంటి వ్యసనాలకు యువత దూరంగా ఉండాలన్నారు. విద్యాసంస్థల్లో చేరినప్పటి నుంచి లక్ష్యంతో ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఈబీ సబ్ ఇన్‌స్పెక్టర్ టి.నారాయణరావు, ఇంజినీరింగ్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.సి.వి.రమణమూర్తినాయుడు, ఫార్మసీ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ కేఈవీ నాగోజీ పాల్గొన్నారు.

'యువ' క్లబ్బులతో పర్యాటకానికి కొత్తరూపు



యువ టూరిజం క్లబ్ బృందంతో నిర్వాహకులు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాలో పర్యాటక ప్రదేశాలకు బహుళ ప్రచారాన్ని కల్పించడంలో 'యువ పర్యాటక క్లబ్బులు' ఎంతగానో దోహదపడతాయని జిల్లా పర్యాటకశాఖ అధికారి నడిమింటి నారాయణరావు అన్నారు. శ్రీకాకుళం పీఎన్‌కాలనీలోని న్యూ సెంట్రల్ స్కూల్‌లో శనివారం యువ టూరిజం క్లబ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు జిల్లాలో అనేక విద్యాసంస్థలు యువ క్లబ్బులు ఏర్పాటుకు ముందుకు వస్తుండటం శుభ పరిణామమని చెప్పారు. జిల్లా విద్యాశాఖ సహకారంతో జిల్లాలో అన్ని ఉన్నత పాఠశాలల్లోనూ యువ క్లబ్‌లను ఏర్పాటు చేస్తామన్నారు. జిల్లాలో సముద్ర తీరం, కళలు, కట్టడాలు, కట్టడాలు, వస్తువులు, పురాతన దేవాలయాల ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. స్కూల్ డైరెక్టర్ పి.శ్రీకాంత్ మాట్లాడుతూ సంస్కృతి, వారసత్వ సంపద పరిరక్షణకు ముందుగా పర్యాటక ప్రదేశాల అభివృద్ధి జరగాలన్నారు. పర్యాటక శాఖ, భారత జాతీయ కళలు, సంస్కృతి వారసత్వ సంస్థ, ఇంటాక్ న్యూఢిల్లీ తరఫున శ్రీకాకుళం చాప్టర్ పర్యాటక క్లబ్బుల ఏర్పాటుకు సహకరిస్తుందని చెప్పారు. ప్రిన్సిపాల్ బి.మల్లేశ్వరరావు మాట్లాడుతూ యువ క్లబ్బుల నిర్వహణకు జిల్లా యువజన సర్వీసుల శాఖ సహకరిస్తుందన్నారు. పర్యాటక రంగంలో మంచి ఉద్యోగాలు పొందవచ్చని వివరించారు. కార్యక్రమంలో ఇంటాక్ మాజీ కన్వీనర్ రాధాప్రసాద్, యువ టూరిజం క్లబ్ కోఆర్డినేటర్ కె.సంతోష్‌కుమార్, సహాయ పర్యాటక అధికారి పి.రమేష్, పాఠశాల అకడమిక్ కోఆర్డినేటర్లు మూర్తి, డీవీఎన్ పట్నాయక్, పర్యాటక శాఖ, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఆడిట్‌కు అధికారులు చొరవ చూపాలి



మాట్లాడుతున్న సహకార అధికారి సుబ్బారావు

శ్రీకాకుళం అర్బన్: సహకార సంఘాల ఆడిట్ నిర్వహణకు అధికారులు చొరవ చూపాలని జిల్లా సహకార శాఖ అధికారి ఎస్.సుబ్బారావు సూచించారు. మహలక్ష్మినగర్ కాలనీలోని సహకార కమ్యూనిటీ హాలులో శనివారం సహకార శాఖ అధికారులకు రాష్ట్ర సహకార యూనియన్(విజయవాడ), రామదాసు సహకార శిక్షణా కేంద్రం(రాజమండ్రి) ఆధ్వర్యంలో శనివారం స్వల్పకాలిక శిక్షణ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో సహకార సంఘాల అభివృద్ధికి అధికారులు సహకరించాలన్నారు. క్రమం తప్పకుండా ఆడిటింగ్ జరిగేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఆడిట్ విషయంలో అధికారులంతా అవగాహన కలిగి ఉండాలన్నారు. జిల్లా సహకార ఆడిట్ అధికారి బి.నగేష్ మాట్లాడుతూ సహకార సంఘాల ఆడిట్ నిర్వహణలో సహకార శాఖ అధికారులది కీలకపాత్ర అని పేర్కొన్నారు. సమావేశంలో ప్రిన్సిపాల్ వి.శ్రీనివాస్, డివిజనల్ సహకార అధికారి కె.దామోదర్, సబ్ డివిజనల్ సహకార అధికారి ఎస్.భూషణరావు, అసిస్టెంట్ రిజిస్ట్రార్ పూజారి జానకిరాం, సహకార శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కొనసాగిన ఏపీజేఏసీ నిరసన



కలెక్టరేట్ వద్ద నిరసన తెలియజేస్తున్న ఉద్యోగులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఏపీ జేఏసీ అమరావతి జిల్లా శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉద్యోగులు చేపట్టిన నిరసన శనివారం 10 రోజుకు చేరుకుంది. 'చేయి చేయి కలుపుదాం.. ఉద్యమానికి సహకరిద్దాం' అనే నినాదంతో ఉద్యమాలు చేస్తున్నారు. ఏపీజేఏసీ అమరావతి– రాష్ట్ర జనరల్ సెక్రటరీ పలిశెట్టి దామోదరరావు నేతృత్వంలో వివిధ ప్రభుత్వ శాఖలు ఉద్యోగులు పాల్గొన్నారు. ఈ నెల 21 నుంచి ఏప్రిల్ 4 వరకు వర్క్ టు రూల్ పాటించాలని నాయకులు పిలుపునిచ్చారు. కార్యక్రమం జిల్లా చైర్మన్ కె.శ్రీరాములు, జనరల్ సెక్రెటరీ ఎన్.వి.రమణ, అసోసియేట్ చైర్మన్ పి.లక్ష్మణరావు, వైస్ చైర్మన్ జె.రామారావు, సెక్రెటరీ నాయుడు, జిల్లా కార్యదర్శి బి.వి.వి.ఎస్.రాజు, ఉపాధ్యక్షులు సోనికిరణ్, నాయక్, కలెక్టరేట్ సెక్రటరీ రాజారెడ్డి, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ పి.శ్రీనివాసరావు, రిటైర్డ్ ఎంప్లాయిస్ అధ్యక్షుడు ఎం.కాశీప్రసాద్, సచివాలయ ఉద్యోగుల సంఘం రాష్ట్ర జనరల్ సెక్రెటరీ ఎన్.గోవిందరావు, జిల్లా అధ్యక్షుడు ఫణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

గాలికుంటు నివారణకు టీకాలు



లావేరులో పశువులకు టీకాలు చేస్తున్న సిబ్బంది

లావేరు: లావేరు, పోతయ్యవలస, వెంకటాపురం, లింగాలవలస, అదపాక, బెజ్జిపురం గ్రామాల్లో శనివారం పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో పాడి పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్లు జి.లక్ష్మీకాంతం, జి.గోపాల్, సిబ్బంది ఎం.జగదీష్ కోరారు.

సచివాలయాల్లో ఆధార్ సేవలు



మాట్లాడుతున్న ఎంపీడీఓ ధనుంజయరావు

రణస్థలం: సచివాలయంలో ఆధార్ శిబిరాల తేదీలను ఖరారు చేసినట్లు ఎంపీడీఓ వండాన ధనుంజయరావు తెలిపారు. రణస్థలం ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ 2016 జూన్ ముందు జారీ అయిన ఆధార్ కార్డుల వివరాలను తప్పనిసరిగా అప్‌డేట్ చేసుకోవాలని సూచించారు. ఈ నెల 20, 21, 27, 28, 29 తేదీల్లో అర్జునవలస, జె.ఆర్.పురం-1, కోటపాలెం, పిషిణి, తెప్పలవలస, పైడిభీమవరం సచివాలయాల్లో ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఇప్పటికే పంచాయతీ సర్పంచులకు, ప్రజా ప్రతినిధులకు సమాచారం అందించామని తెలిపారు. ఆధార్ శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



మాట్లాడుతున్న పిన్నింటి సాయికుమార్

జి.సిగడాం: దళారుల ప్రమేయం లేకుండా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిన్నింటి సాయికుమార్ అన్నారు. శనివారం సర్వేశ్వరపురం, జాడ, జి.సిగడాం గ్రామాల్లో పర్యటించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా లబ్ధిదారుల ఇంటి తలుపు తట్టి సంక్షేమ పథకాలను అందిస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల బూత్ కన్వీనర్ ఆబోతుల జగన్నాథం, నక్క శశిభూషణనాయుడు, చందనాల రామకృష్ణ రంగారావు, మహంతి సత్యనారాయణ పాల్గొన్నారు.

చిన్నారులకు టీకాలు తప్పనిసరి



తాళ్లవలసలో పిల్లలకు వ్యాక్సిన్ వేస్తున్న వైద్య సిబ్బంది

లావేరు: పిల్లలకు తప్పకుండా వ్యాక్సినేషన్ చేయించాలని లావేరు, మురపాక పీహెచ్‌సీల వైద్యులు డాక్టరు మౌనిక, డాక్టరు మణిభూషణ్ అన్నారు. శనివారం పీహెచ్‌సీల పరిధిలోని గ్రామాల్లో చిన్నారులకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ పోలియో, చికెన్ పాక్సు, తట్టు, కలరా, పచ్చకామెర్లు వంటి వ్యాధులు రాకుండా టీకాలు విధిగా వేయించాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశ, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

23న వెంకన్న ఆలయ హుండీల లెక్కింపు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని గుజరాతిపేటలో వేంకటేశ్వరస్వామి ఆలయ హుండీలను ఈ నెల 23న దేవదాయశాఖ అధికారులు, భక్తుల సమక్షంలో లెక్కించనున్నట్లు ఈవో శ్యామలరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 20న పాతబ్రిడ్జి రోడ్డులోని దుర్గాదేవి ఆలయం హుండీ ఆదాయం లెక్కిస్తామని పేర్కొన్నారు.

గురుకుల విద్యతో ఉజ్వల భవిత



గురుకుల విద్య ప్రాధాన్యతను సచివాలయ ఉద్యోగులకు వివరిస్తున్న బోధకులు

ఎచ్చెర్ల క్యాంపస్: గురుకుల విద్యను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎచ్చెర్ల బాలికల డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల/జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.పద్మజ అన్నారు. చిలకపాలెం గ్రామ సచివాలయంలో అంబేద్కర్ గురుకుల పాఠశాలల ప్రవేశాల నోటిఫికేషన్, ఐదో తరగతి, ఇంటర్మీడియట్ మొదటి ఏడాది ప్రవేశాలపై సచివాలయ సిబ్బందికి శనివారం అవగాహన కల్పించారు. ఎచ్చెర్ల గురుకుల పాఠశాల్లో ప్రవేశ పరీక్ష ద్వారా బాలికలకు 5వ తరగతితో 80 సీట్లకు, ఇంటర్మీడియట్‌లో ఎంపీసీలో 40 సీట్లకు, బైపీసీలో 40 సీట్లకు ప్రవేశాలు కల్పించనున్నట్లు వివరించారు. ఈ నెల 24లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. హెటీటీపీఎస్//ఏపీజీపీసెట్.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఏప్రిల్ 24న ఉదయం 10 నుంచి 12 గంటల వరకు 5వ తరగతి ప్రవేశ పరీక్ష, మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు ఇంటర్మీడియట్ ప్రవేశ పరీక్షలు ఉంటాయని పేర్కొన్నారు. ప్రమాణాలతో కూడిన ఇంగ్లిష్ మీడియం విద్య, ఉచిత భోజన, వసతి సౌకర్యాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. ఇంటర్మీడియట్‌లో ఎంసెట్, నీట్, జేఈఈ వంటి పరీక్షలకు సైతం శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బోధన సిబ్బంది జీ.వి.నాగమణి, ఎం.రమణమ్మ, జె.హారతి తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల కరపత్రం ఆవిష్కరణ



కరపత్రం ఆవిష్కరిస్తున్న కలెక్టర్, కమిటీ సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: పాత శ్రీకాకుళం కలెక్టర్ బంగ్లా ఎదురుగా ఉన్న కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల కరపత్రాన్ని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ శనివారం తన చాంబర్‌లో ఆవిష్కరించారు. ఏప్రిల్ 8, 9, 10 తేదీల్లో శ్రీవారి కల్యాణ మహోత్సవం, పూర్ణాహుతులు, చక్రస్నానాలు, అన్న ప్రసాద వితరణ జరుగుతాయని కమిటీ సభ్యులు తెలిపారు. ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ గౌరవ అధ్యక్షుడు లోకనాథం నందికేశ్వరరావు, అధ్యక్ష కార్యదర్శులు మర్రి యోగేశ్వరరావు, బెహరా నాగేశ్వరరావు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

చిల్డ్రన్ క్లబ్‌లతో విజ్ఞానం



లావేరు: బహుమతులు అందజేస్తున్న గ్రంథాలయాధికారి

లావేరు: విజ్ఞానం, వినోదం అందించేందుకు చిల్డ్రన్ క్లబ్‌లు దోహదపడతాయని లావేరు శాఖా గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు అన్నారు. లావేరు శాఖా గ్రంథాలయంలో శనివారం చిల్డ్రన్ క్లబ్‌ను ఏర్పాటు చేశారు. విద్యార్థులకు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకుడు ఎ.గడ్డెయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.



ఎచ్చెర్ల: బహుమతులతో విద్యార్థులు, గ్రంథాలయ సిబ్బంది

– ఎచ్చెర్ల: ధర్మవరం శాఖా గ్రంథాలయంలో ప్రతి మూడో శనివారం చిల్డ్రన్ క్లబ్ ఏర్పాటు చేస్తున్నామని గ్రంథాలయ అధికారి ఎం.చంద్రశేఖరరావు తెలిపారు. శనివారం విద్యార్థులతో శతక పద్యాలు, జాతీయ నాయకుల పుస్తకాలు, బాలసాహిత్యం చదివించారు. కథలు చెప్పిన విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయాధికారి బి.సూర్యనారాయణ, ఉపాధ్యాయులు కె.వెంకటరావు, బి.రాంబాబు పాల్గొన్నారు.

వైభవంగా ఆదిత్యుని కల్యాణం



ఉషా పద్మిని ఛాయాదేవి అమ్మవార్లతో సూర్యనారాయణస్వామి కల్యాణోత్సవం శనివారం అరసవల్లిలోని ఆదిత్యాలయ అనివెట్టి మండపంలో ఘనంగా జరిగింది. ఫాల్గుణ బహుళ ఏకాదశి పర్వదినం సందర్భంగా ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించారు. కార్యక్రమంలో ఈవో వి.హరిసూర్యప్రకాష్, సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు, నేతేటి హరిప్రసాద్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

– అరసవల్లి